జ్వాల
# దశ
నిజం.. నిర్భయంగా..

WWW.DASHANEWS.COM
మంగళవారం
08-09-2026
సంపుటి 1 సంచిక 287
పేజీలు : 04
వెల : 1/-
PRGI No : TGTEL/25/A4195


4లో

## యూట్యూబర్ నందన అరెస్ట్





## అసెంబ్లీ గేటు వద్ద

# రణరంగం!



### నల్ల టీషర్టతో బీఆర్ఎస్ నిరసన.. కేటీఆర్, హరీశ్ సహా నేతల అరెస్టు

**దశ, హైదరాబాద్ :** తెలంగాణ అసెంబ్లీ వర్షాకాల సమావేశాల తొలిరోజే అసెంబ్లీ ప్రధాన గేటు వద్ద తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. కాంగ్రెస్ ప్రభుత్వ 1,000 రోజుల పాలనను నిరసిస్తూ నల్ల టీషర్టులు ధరించి అసెంబ్లీకి వచ్చిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలను పోలీసులు అడ్డుకున్నారు. నల్ల టీషర్టులపై కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ప్రస్తావిస్తూ నినాదాలు ఉండటంతో వారిని లోపలికి అనుమతించలేదు. దీంతో బీఆర్ఎస్ నేతలు, పోలీసుల మధ్య తోపులాట చోటుచేసుకుంది. ఈ ఘటనలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రులు హరీశ్‌రావు, జగదీశ్‌రెడ్డి సహా పలువురు నేతలకు స్వల్ప గాయాలైనట్లు సమాచారం. అనంతరం కేటీఆర్, హరీశ్‌రావు సహా పలువురు బీఆర్ఎస్ నేతలను పోలీసులు అదుపులోకి తీసుకుని తెలంగాణ భవన్‌కు తరలించారు. పోలీసులు నల్ల టీషర్టులతో లోపలికి అనుమతించకపోవడంతో హరీశ్‌రావు టీషర్ట్ తొలగించి బనియన్‌తో అసెంబ్లీలోకి వెళ్లేందుకు ప్రయత్నించారు. అయినప్పటికీ పోలీసులు ఆయనను అడ్డుకుని అదుపులోకి తీసుకున్నారు. నల్ల దుస్తులు ధరించిన బీఆర్ఎస్ సభ్యులను మాత్రమే నిలిపివేసి, సాధారణ దుస్తుల్లో వచ్చిన సభ్యులను లోపలికి అనుమతించినట్లు రిపోర్టులు పేర్కొన్నాయి. మరోవైపు మహిళా బీఆర్ఎస్ ఎమ్మెల్యేలతో పోలీసులు దురుసుగా వ్యవహరించారని ఆ పార్టీ ఆరోపించింది. ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి పోలీసుల చర్యలో స్వల్పంగా గాయపడ్డారని, తన పట్ల అనుచితంగా వ్యవహరించారని ఆరోపించారు. మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి



తన జుట్టును పోలీసులు లాగారని ఆరోపించారు. ఈ ఆరోపణలపై బీఆర్ఎస్ నేతలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. అసెంబ్లీకి వెళ్లే ముందు గన్‌పార్క్ వద్ద బీఆర్ఎస్ నేతలు నిరసన చేపట్టారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను 1,000 రోజులు పూర్తయినా అమలు చేయలేదని కేటీఆర్ ఆరోపించారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు, రైతులు, ప్రభుత్వ ఉద్యోగులు, అంగన్‌వాడీ సిబ్బంది తదితర సమస్యలను అసెంబ్లీలో లేవనెత్తుతామని తెలిపారు. బీఆర్ఎస్ నేతల అరెస్టులు, పోలీసుల చర్యలను నిరసిస్తూ రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలకు పార్టీ పిలుపునిచ్చింది. దీంతో అసెంబ్లీ సమావేశాల తొలిరోజే అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీఆర్ఎస్ మధ్య రాజకీయ ఉద్రిక్తత తీవ్రస్థాయికి చేరింది.

## చరిత్రలో బ్లాక్‌డే!

### మహిళా ఎమ్మెల్యేలపై దాడి దారుణం.. బీఆర్ఎస్ ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి

దశ, హైదరాబాద్: అసెంబ్లీ చరిత్రలోనే ఇది బ్లాక్‌డే అని బీఆర్ఎస్ ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి అన్నారు. మహిళా ఎమ్మెల్యేలకే రక్షణ లేకపోతే రాష్ట్రంలోని మహిళలకు రక్షణ ఎక్కడిదని ప్రశ్నించారు. తమపై జరిగిన దాడి కేవలం తమకే పరిమితం కాదని, యావత్ మహిళా లోకాన్ని అవమానించేలా ఉందని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు.



## తెలంగాణకు ఇది ఒక చీకటి రోజు

### స్పీకర్‌ను అవమానించడం సభకు జరిగిన అవమానమే.. సీఎం రేవంత్



**దశ, హైదరాబాద్:** తెలంగాణకు ఇది ఒక చీకటి రోజు అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. శాసనసభలో సోమవారం ఆయన మాట్లాడుతూ.. సభాపతి గడ్డం ప్రసాద్‌కుమార్‌పై సభ్య సమాజం తలవంచుకునేలా కొందరు అనుచిత వ్యాఖ్యలు చేశారని మండిపడ్డారు. స్పీకర్‌ను అవమానించడం కేవలం వ్యక్తిగత అవమానం కాదని, శాసనసభ గౌరవానికి సంబంధించిన అంశమని అన్నారు. సభలో చర్చ జరిగిన తర్వాతే నిర్ణయాలు తీసుకుంటామని, బీజేపీ లేవనెత్తిన అంశాలపై కూలంకషంగా చర్చించాల్సిన అవసరం ఉందన్నారు. చర్చ లేకుండా నిర్ణయం తీసుకోవాలని కోరడం వారి 'చీకటి మిత్రులను' కాపాడే ప్రయత్నమేనని విమర్శించారు. కాళేశ్వరం అంశంపై ఇదే సభలో చర్చించి విచారణకు ఆదేశించిన విషయాన్ని గుర్తుచేశారు. సభా సంప్రదాయాలను కాపాడాల్సిన బాధ్యత ప్రతి సభ్యుడిపైనా ఉందన్నారు. ముఖ్యమంత్రి అయినా, సాధారణ ఎమ్మెల్యే అయినా స్పీకర్ ఎదుట అందరూ సమానమేనని రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. స్పీకర్‌ను, ఆయన కుటుంబ సభ్యులను అవమానించేలా మాట్లాడటం క్షమించరాని నేరమన్నారు. ఇది కేవలం దళితులకు జరిగిన అవమానం కాదని, నాలుగు కోట్ల తెలంగాణ ప్రజలకు జరిగిన అవమానమని అన్నారు. రాజకీయాలకు అతీతంగా సభ్యులంతా ముక్తకంఠంతో ఖండించాలని పిలుపునిచ్చారు. బీఆర్ఎస్‌ది దళిత వ్యతిరేక

..మిగతా 4వ పేజీలో →

## ఓట్ల తొలగింపునకు కుట్ర!

### తెలంగాణలో కోటి ఓట్లపై వేటు.. సీఎం రేవంత్ సంచలన ఆరోపణలు

**దశ, హైదరాబాద్:** తెలంగాణలో కోటి ఓట్లను తొలగించేందుకు కుట్ర జరుగుతోందని సీఎం రేవంత్‌రెడ్డి ఆరోపించారు. ఎస్ఐఆర్ ప్రక్రియపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. బీజేపీకి వ్యతిరేకంగా ఉన్న ఓటర్లను గుర్తించి వారి ఓట్లను తొలగించే ప్రయత్నం జరుగుతోందని విమర్శించారు. రవీంద్రభారతిలో సారంపల్లి మల్లారెడ్డి సంస్మరణ సభలో సీఎం మాట్లాడుతూ.. కొడంగల్‌లో 81 వేల ఓట్లను అనామలీస్ జాబితాలో చేర్చారని తెలిపారు. పేదలు, గిరిజను కూడా తొలగించే ప్రయత్నం జరుగుతోందని ఆరోపించారు. 2029లో మోదీ ఓటమికి ప్రస్తుత ఓట్లే పునాది అవుతాయని అన్నారు.

## దేవాదాయ శాఖ.. మంత్రులకు గండమేనా?

### సురేఖ ఉద్వాసనతో మరోసారి తెరపైకి ఆరుదశాబ్దాల సెంటిమెంట్



**దశ, హైదరాబాద్:** రాజకీయాల్లో కొన్ని శాఖలకు ప్రత్యేక గుర్తింపు ఉంటుంది. అందులో దేవాదాయ, ధర్మాదాయ శాఖది అత్యంత సున్నితమైన స్థానం. ఆలయాల పాలన, దేవుడి మాన్యాలు, భూములు, నిధులతో ముడిపడి ఉండే ఈ శాఖను చేపట్టిన పలువురు మంత్రులకు రాజకీయంగా మాత్రం కాలం కలిసిరాలేదన్న సెంటిమెంట్ చాలాకాలంగా కొనసాగుతోంది. తాజాగా మంత్రి కొండా సురేఖ మంత్రివర్గం నుంచి ఉద్వాసనకు గురికావడంతో ఈ చర్చ మరోసారి తెరపైకి వచ్చింది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ నుంచి ప్రత్యేక తెలంగాణ వరకు దేవాదాయ శాఖను నిర్వహించిన పలువురు నేతల రాజకీయ ప్రస్థానం అనూహ్య మలుపులు తిరిగింది. 1962లో ఉమ్మడి ఏపీలో తొలి మహిళా దేవాదాయ శాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టిన సదాలక్ష్మి ఏడాది తిరగకముందే శాఖను కోల్పోయారు. అనంతరం తప్పుకున్నారు. 2009లో ఎన్నికల్లోనూ ఓటమి పాలయ్యారు. అదే ప్రభుత్వంలో జూపల్లి కృష్ణారావు 2009లో శాఖ బాధ్యతలు చేపట్టి తెలంగాణ ఉద్యమ సమయంలో 2011లో మంత్రి పదవికి రాజీనామా చేశారు. 2014లో ఏపీ టీడీపీబీజేపీ ప్రభుత్వంలో దేవాదాయ శాఖ నిర్వహించిన మాణిక్యాలరావు 2019 ఎన్నికల్లో డిపాజిట్ కూడా దక్కించుకోలేకపోయారు. తెలంగాణ ఏర్పాటైన తర్వాత కేసీఆర్ ప్రభుత్వం ఏడాది పాటు ఈ శాఖను ఎవరికీ కేటాయించలేదు. 2014 డిసెంబరులో బాధ్యతలు చేపట్టిన అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి 2023 వరకు సుదీర్ఘకాలం శాఖను నిర్వహించినప్పటికీ, 2023 అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి పాలయ్యారు. తాజాగా కాంగ్రెస్ ప్రభుత్వంలో

..మిగతా 4వ పేజీలో →




## బీఆర్ఎస్ ఎమ్మెల్యేలకు హైకోర్టులో ఊరట

### అసెంబ్లీకి వెళ్లకుండా పోలీసులు అడ్డుకోవద్దు.. కీలక ఆదేశాలు

**దశ, హైదరాబాద్:** అసెంబ్లీకి వెళ్లే బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను పోలీసులు అడ్డుకోవద్దని తెలంగాణ హైకోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది. పోలీసుల చర్యలను సవాల్ చేస్తూ బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ చేపట్టిన న్యాయస్థానం ఈ మేరకు స్పష్టం చేసింది. అసెంబ్లీ నిబంధనలను ఉల్లంఘించిన శాసనసభ్యులపై చర్యలు తీసుకునే అధికారం స్పీకర్‌కే ఉంటుందని పేర్కొంది. ఎమ్మెల్యేలపై పోలీసులు చర్యలు తీసుకోవద్దని ఆదేశించింది. అసెంబ్లీకి వెళ్తున్న మహిళా ఎమ్మెల్యేలపై దాడికి పాల్పడిన పోలీసులను గుర్తించాలని, వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డీజీపీని ఆదేశించింది. ఈ వ్యవహారంపై హోంశాఖ జీపీకి నోటీసులు జారీ చేసిన హైకోర్టు.. తదుపరి విచారణను రెండు వారాలకు వాయిదా వేసింది.

..మిగతా 4వ పేజీలో →




## హౌస్ అరెస్టులపై బీజేపీ ఫైర్!

### అసెంబ్లీ ముట్టడికి పిలుపు.. నేతలు, కార్యకర్తల ముందస్తు అరెస్టులు.

దశ, హైదరాబాద్: తెలంగాణ అసెంబ్లీ వర్షాకాల సమావేశాల ప్రారంభానికి ముందే రాష్ట్రంలో రాజకీయ వేడి రాజుకుంది. అసెంబ్లీ ముట్టడికి బీజేపీ పిలుపునివ్వడంతో పోలీసులు అప్రమత్తమై పలువురు ఆ పార్టీ నేతలు, కార్యకర్తలను ముందస్తుగా అరెస్టు చేసి గృహనిర్బంధం చేశారు. హైదరాబాద్‌తో పాటు పలు జిల్లాల్లో బీజేపీ, ఏబీవీపీ నాయకుల అరెస్టులతో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని, 22ఏ జాబితా నుంచి ప్రైవేటు భూములను తొలగించాలని

..మిగతా 4వ పేజీలో →

# యూట్యూబర్ నందన అరెస్ట్



**దశ, హైదరాబాద్ :** ప్రముఖ యూట్యూబర్ నందనను శంషాబాద్ రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయంలో పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఆమెపై లుకౌట్ నోటీసులు ఉండటంతో సోమవారం విమానాశ్రయంలో గుర్తించిన ఇమ్మిగ్రేషన్ అధికారులు పోలీసులకు సమాచారం అందించారు. దీంతో ఎయిర్‌పోర్ట్ పోలీసులు నందనను అరెస్ట్ చేసి ఇబ్రహీంపట్నం పోలీసులకు అప్పగించారు. నందన, ఆమె భర్త మధుకర్ కలిసి లండన్‌లో ఉద్యోగాలు, వీసాలు ఇప్పిస్తామని పలువురి నుంచి భారీగా డబ్బులు వసూలు చేశారనే ఆరోపణలు ఉన్నాయి. బాధితుల ఫిర్యాదుతో ఇబ్రహీంపట్నం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఈ కేసులో భాగంగానే నందనపై లుకౌట్ నోటీసులు జారీ చేసినట్లు తెలుస్తోంది. 'నందూస్ వరల్డ్' పేరుతో నందన, మధుకర్ చేసిన వీడియోలు సోషల్ మీడియాలో విస్తృతంగా ప్రాచుర్యం పొందాయి. నందన ఇటీవల సినిమాలు, ఓటీటీ చిత్రాల్లోనూ నటించారు. కాగా, ఈ కేసుకు సంబంధించి మరిన్ని వివరాలు పోలీసుల దర్యాప్తులో వెల్లడికావాల్సి ఉంది.

## క్షమాపణ చెప్పాకే.. మిగతా కార్యకలాపాలు : మంత్రి శ్రీధర్ బాబు


హైదరాబాద్: తెలంగాణ అసెంబ్లీ(Telangana Assembly) ప్రాంగణంలో బీఆర్ఎస్ సభ్యుల నిరసనతో నెలకోన్న తీవ్ర ఉద్రిక్తతపై రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు(Minister Sridhar Babu) స్పందించారు. తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్(Speaker Gaddam Prasad)పై అంత ఘోరమైన భాష ఉపయోగించడం సరికాదని ఆయన మండిపడ్డారు. సభ్యసమాజం అసహ్యించుకునే భాషను బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధు మాట్లాడారని, ఈ ఘటనపై స్పందించాల్సిన బాధ్యత మాజీ సీఎం, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ పై ఉందని శ్రీధర్ బాబు పేర్కొన్నారు. కేసీఆర్ స్పందించకుంటే ఆయనే ప్రేరేపించారన్న అనుమానాలు వస్తాయని, పోలీసులపై కేటీఆర్ చేయి చేసుకున్నట్లు కనబడుతుందన్నారు. పోలీస్ సిబ్బందిని గొంతు పిసుకుతున్నట్లు కనిపించిందని, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లోనూ పోలీసులపై ఇలాంటి ఘటనాలు జరగలేదని మంత్రి తెలిపారు. టీషర్టుపై నినాదాలు ఉంటే అనుమతించకూడదని నిబంధన ఉందని, సభా గౌరవాన్ని తగ్గించేలా బీఆర్ఎస్(BRS) సభ్యులు టీషర్టులపై నినాదాలు ఉన్నాయి. రూల్స్ కు అనుగుణంగానే స్పీకర్ నిర్ణయం తీసుకున్నారని, మహిళా సభ్యులకు ఇబ్బంది జరిగిందని తెలియగానే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి(Chief Minister Revanth Reddy) సమీక్ష చేశారు. ఏవైనా లోటుపాట్లు జరిగితే మా ప్రభుత్వం సీరియస్ గా తీసుకుంటుందని, దీంతో దళిత వ్యతిరేక పార్టీగా బీఆర్ఎస్ నిరూపించుకుంటుందని శ్రీధర్ బాబు ఆగ్రహం వ్యక్తం చేశారు. స్పీకర్ పై అవిశ్వాస తీర్మానం పెడతామని కేసీఆర్ బెదిరిస్తున్నారని, వారి బెదిరింపులకు కాంగ్రెస్ భయపడే ప్రసక్తి లేదు.





# భూగర్భ జలాలకు గండం!

### కుత్బుల్లాపూర్‌లో 40 మీటర్ల లోతుకు.. 11 మండలాల్లో 20 మీటర్ల దిగువకు నీటిమట్టం



**దశ, హైదరాబాద్:** నగరంలో భూగర్భ జలాల పరిస్థితి ఆందోళనకరంగా మారుతోంది. ఈ ఏడాది వర్షాకాలంలో నీటిమట్టాలు స్వల్పంగా మెరుగుపడినప్పటికీ.. గత ఏడాది నమోదైన లోటును పూర్తిగా పూడ్చుకోలేకపోయాయి. భూగర్భ జలాల శాఖ తాజా అంచనాల ప్రకారం 2026 ఆగస్టులో హైదరాబాద్‌లో సగటు భూగర్భ జలమట్టం 11.20 మీటర్ల లోతులో నమోదైంది. గత ఏడాది ఆగస్టులో ఇది 6.36 మీటర్లుగా ఉండగా.. ఏడాది వ్యవధిలో సగటు నీటిమట్టం దాదాపు ఐదు మీటర్ల మేర లోతుకు పడిపోయింది. ముఖ్యంగా కుత్బుల్లాపూర్‌లో పరిస్థితి తీవ్రంగా ఉంది. అక్కడ ఆగస్టులో భూగర్భ జలమట్టం ఏకంగా 39.89 మీటర్ల లోతులో నమోదైంది. గత ఏడాది ఇదే సమయంలో 14.15 మీటర్లుగా ఉండగా.. 27.74 మీటర్ల భారీ తేడా కనిపించింది. తిరుమలగిరిలో నీటిమట్టం 13.73 మీటర్ల మేర పడిపోయి 17.68 మీటర్లకు చేరింది. మారేడ్‌పల్లిలోనూ 12.97 మీటర్ల పతనం నమోదైంది. శేరిలింగంపల్లి, మేడిపల్లి, మేడ్చల్, ఉప్పల్, కూకట్ పల్లి, హఫీజ్ పేట్ ప్రాంతాల్లోనూ పలు పరిశీలనా కేంద్రాల్లో గణనీయమైన వార్షిక పతనం నమోదైంది. నగరంలో భూగర్భ జలాల క్షీణతకు లోటు వర్షపాతం ప్రధాన కారణంగా కనిపిస్తోంది. ఆగస్టు వరకు హైదరాబాద్‌కు సాధారణంగా 460 మిల్లీమీటర్ల వర్షపాతం రావాల్సి ఉండగా.. 360 మిల్లీమీటర్లు మాత్రమే నమోదైంది. దీంతో 22 శాతం లోటు ఏర్పడింది. పర్యవేక్షణలో ఉన్న 46 మండలాల్లో 28 మండలాల్లో లోటు వర్షపాతం నమోదవగా.. 17 మండలాల్లో సాధారణ వర్షపాతం నమోదైంది. మొయినాబాద్‌లో మాత్రమే అధిక వర్షపాతం నమోదైంది. వర్షపాతం తగ్గడంతోపాటు కురిసిన నీటిని భూగర్భంలోకి చేర్చే రీచార్జ్ వ్యవస్థలు తగినంతగా పనిచేయకపోవడం కూడా పరిస్థితిని మరింత దిగజారుస్తోంది. నగర విస్తరణతో పెరుగుతున్న కాంక్రీట్ నిర్మాణాలు, తగ్గిపోతున్న సహజ నీటి నిల్వ ప్రాంతాలు వర్షపు నీరు భూమిలోకి ఇంకే అవకాశాలను తగ్గిస్తున్నాయి. దీంతో భూగర్భ జలాలపై ఒత్తిడి పెరుగుతోంది.
అయితే మేలో నమోదైన నీటిమట్టంతో పోలిస్తే ఆగస్టులో సగటున 0.80 మీటరు మేర పెరుగుదల నమోదైంది. 2016-2025 దశాబ్ద సగటుతో పోల్చినప్పుడు 14 మండలాల్లో ఈసారి ఆగస్టు నీటిమట్టాలు మెరుగ్గా ఉన్నట్లు అధికారులు తెలిపారు. కొన్ని ప్రాంతాల్లో ఈ పెరుగుదల 17.07 మీటర్ల వరకు ఉంది. అయినప్పటికీ 11 మండలాల్లో భూగర్భ జలమట్టం 20 మీటర్ల కంటే లోతులోనే ఉండటం నగరానికి హెచ్చరికగా మారింది.
వర్షపు నీటిని ఒడిసిపట్టడం, చెరువులు-కుంటలను పరిరక్షించడం, రీచార్జ్ వ్యవస్థలను విస్తరించడం ద్వారా భూగర్భ జలాల పునరుద్ధరణపై తక్షణ చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉందని నిపుణులు సూచిస్తున్నారు.

## రూ. 10,000 లంచం తీసుకుంటూ రెడ్ హ్యాండ్ పట్టుబడ్డ సబ్ జైలర్



**దశ హుజురాబాద్ :** కరీంనగర్ జిల్లా హుజురాబాద్ సబ్ జైల్ లో ఇటీవల ఓ కేసులో శిక్ష అనుభవిస్తున్న ఖైదీకి అదనపు సదుపాయాలు కల్పించడం తో పాటు ఖమ్మం జైలు కు పంపకుండా ఉండాలంటే తనకు పది వేల లంచం ఇవ్వాలని డిమాండ్ చేశాడుసబ్ జైలర్ దేవేందర్. అయితే బాధితుడి బంధువు ఏ సి బి అధికారులను ఆశ్రయించాడు. దీంతో రంగం లో దిగిన ఏ సి బి అధికారులు ఖైదీ బంధువుల నుండి సబ్ జైల్ పెట్రోల్ పంపు లో పనిచేస్తున్న హరీష్ అనే వ్యక్తి ద్వార పది వేలు లంచం తీసుకుంటుండగా రెడ్ హ్యాండెడ్ గా పట్టుకున్నరు అధికారులు. అనంతరం సబ్ జైల్ లోని రికార్డులను పరిశీలించి సబ్ జైలర్ తో పాటు హరీష్ అనే వ్యక్తినీ అదుపులో తీసుకొని విచారిస్తున్నారు. అనంతరం వీరిని రిమాండ్ కు తరలించనున్నట్లు ఏ సి బి అధికారులు తెలిపారు.

## దేవాదాయ శాఖ.. మంత్రులకు గండమేనా?

మొదటి పేజీ తరువాయి

దేవాదాయ, అటవీ, పర్యావరణ శాఖలను నిర్వహించిన కొండా సురేఖ పలు రాజకీయ వివాదాల నేపథ్యంలో మంత్రివర్గం నుంచి తప్పుకోవాల్సి వచ్చింది. దీంతో దేవాదాయ శాఖను చేపట్టిన నేతలకు రాజకీయంగా ఎదురుదెబ్బలు తప్పడం లేదన్న చర్చ మళ్లీ మొదలైంది. గతంలో కేసీఆర్ ప్రభుత్వంలో ఆరోగ్యశాఖ నుంచి తప్పుకున్న డాక్టర్ టి.రాజయ్య, తాజాగా మంత్రి పదవి కోల్పోయిన కొండా సురేఖ ఇద్దరూ ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన నేతలు కావడం కూడా రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది సంక్షేమ పథకాలు, భారీ బడ్జెట్లు, రాజకీయంగా మైలేజ్ ఇచ్చే శాఖలతో పోలిస్తే దేవాదాయ శాఖలో భూములు, ఆలయ నిధులు, పాలనా వివాదాలు, స్థానిక ఆధిపత్య పోరాటాలు నిత్యం సవాళ్లుగా ఉంటాయి. కారణాలు పాలనాపరమైనవైనా, రాజకీయ సమీకరణాలైనా.. దేవాదాయ శాఖ పగ్గాలు చేపట్టిన నేతలకు రాజకీయంగా కలిసి రావడం లేదన్న సెంటిమెంట్ మాత్రం దశాబ్దాలుగా కొనసాగుతూనే ఉంది.

## హౌస్ అరెస్టులపై బీజేపీ ఫైర్!

మొదటి పేజీ తరువాయి

డిమాండ్ చేస్తూ బీజేపీ ఆందోళనకు పిలుపునిచ్చింది. 'ఫీజు బకాయి-బీజేపీ లడాయి' కార్యక్రమంలో భాగంగా 'చలో ఇందిరాపార్క్' చేపట్టాలని ఆ పార్టీ రాష్ట్ర నాయకులు ఎన్. రామచందర్‌రావు పిలుపునిచ్చారు. అయితే కార్యక్రమానికి పోలీసులు అనుమతి నిరాకరించారు. అనుమతి లేకపోయినా అసెంబ్లీ ముట్టడికి బీజేపీ శ్రేణులు సిద్ధమవడంతో పోలీసులు ముందస్తు చర్యలకు దిగారు. హైదరాబాద్‌తో పాటు ఖమ్మం తదితర జిల్లాల్లో పలువురు బీజేపీ, ఏబీవీపీ నాయకులు, కార్యకర్తలను అదుపులోకి తీసుకున్నారు. అసెంబ్లీ పరిసరాల్లో భారీగా పోలీసు బలగాలను మోహరించి భద్రతను కట్టుదిట్టం చేశారు. మరోవైపు, ముందస్తు అరెస్టులు, గృహనిర్బంధాలపై బీజేపీ నేతలు తీవ్రంగా మండిపడ్డారు. శాంతియుతంగా నిరసన తెలిపే హక్కును ప్రభుత్వం అడ్డుకుంటోందని, ప్రజాస్వామ్య పద్ధతిలో చేపట్టే ఆందోళనలను అణచివేయడం సరికాదని విమర్శించారు. అసెంబ్లీ సమావేశాల సందర్భంగా ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలను సభ లోపల, వెలుపల ఎండగడతామని స్పష్టం చేశారు.



## ప్రజావాణి దరఖాస్తుల పరిష్కారం పై ప్రత్యేక దృష్టి పెట్టాలి

### జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్పాయ్

**హనుమకొండ,:** ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుంచి స్వీకరించిన గ్రీవెన్స్ దరఖాస్తుల పరిష్కారంపై అన్ని శాఖల అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి(Collector Chahat Bajpai) ఆదేశించారు. సోమవారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాలులో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల సమస్యలపై ఫిర్యాదులను కలెక్టర్, అదనపు కలెక్టర్ ఎన్. రవి స్వయంగా స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న ప్రజావాణి(Prajavani) దరఖాస్తులను శాఖల వారీగా పరిశీలించి, సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి నిబంధనల మేరకు పరిష్కరించాలని సూచించారు. ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం ప్రజావాణి కార్యక్రమంలో సమర్పించిన దరఖాస్తులు పెండింగ్‌లో ఉండకుండా నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని పేర్కొన్నారు. ప్రజావాణి దరఖాస్తులపై తీసుకున్న చర్యలపై దరఖాస్తుదారులకు తగిన సమాచారం అందించాలని అధికారులకు సూచించారు. ప్రజావాణి కార్యక్రమంలో ప్రజలు వివిధ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ జిల్లాస్థాయిలో 123, డివిజన్ 23, మండల ఆఫీసర్స్ స్థాయిలో 123 (మొత్తం 269)దరఖాస్తులను అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఇన్చార్జి అడిషనల్ కలెక్టర్ శేషాద్రి, డిఆర్ఓ శ్రీనివాస్, డి ఆర్ డి ఓ మేన శ్రీను, సిపిఓ సత్యనారాయణరెడ్డి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## ఆటో కార్మికుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కృషి

### ఆటో ఛార్జీల పెంపునకు సానుకూలం



**దశ, హైదరాబాద్ :** రాష్ట్రంలోని ఆటో డ్రైవర్లు, కార్మికుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోందని రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, కార్మిక శాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకట్ స్వామి తెలిపారు. ఆటో కార్మిక సంఘాల ప్రతినిధులతో సచివాలయంలో సోమవారం మంత్రులు సమావేశమై వారి సమస్యలపై సుదీర్ఘంగా చర్చించారు. గత ఆగస్టు 23న జరిగిన సమావేశంలో చర్చించిన అంశాలపై తీసుకున్న చర్యలను కూడా సమీక్షించారు. ఆటో ఛార్జీలను పెంచేందుకు ప్రభుత్వం సానుకూలంగా ఉందని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. 2012 తర్వాత ఆటో ఛార్జీలు పెరగలేదని, ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా ఛార్జీలను సవరించాల్సిన అవసరం ఉందన్నారు. రవాణా శాఖ అధికారులు, ఆటో కార్మిక సంఘాల ప్రతినిధులతో కమిటీ ఏర్పాటు చేసి సమగ్ర నివేదిక రూపొందించనున్నట్లు చెప్పారు. కమిటీ సిఫారసుల ఆధారంగా త్వరలో కొత్త ఛార్జీలను అమలు చేస్తామని వెల్లడించారు. టీజీఎస్ఆర్టీసీ ద్వారా ఈవీ ఆటోలను ప్రవేశపెట్టి లాస్ట్‌మైల్ కనెక్టివిటీ పాలసీ తీసుకురానున్నట్లు జరుగుతున్న ప్రచారంలో వాస్తవం లేదని మంత్రి స్పష్టం చేశారు. ప్రస్తుతం అలాంటి ప్రతిపాదనపై ఎలాంటి చర్చ జరగడం లేదని, ఆటో కార్మికులు తప్పుడు ప్రచారాన్ని నమ్మవద్దని సూచించారు. ఓలా, ఉబెర్ తరహాలో ప్రభుత్వ ఆధ్వర్యంలో ప్రత్యేక యాప్‌ను అందుబాటులోకి తీసుకురావడంపై ఐటీ శాఖతో సంప్రదింపులు జరిపినట్లు మంత్రి తెలిపారు. ఆటో డ్రైవర్లకు ప్రయోజనం కలిగేలా ఈ విధానాన్ని రూపొందించే అంశాన్ని పరిశీలిస్తున్నామన్నారు. హైదరాబాద్‌లో 18,700 ఆటోలకు రెట్రోఫిట్మెంట్ కోసం ఒక్కో ఆటోకు రూ.1.50 లక్షల చొప్పున ఆర్థిక సహాయం అందించే అంశాన్ని కూడా ప్రభుత్వం చేపట్టిందని తెలిపారు. ఆటో డ్రైవర్ల సంక్షేమ బోర్డు ఏర్పాటుపై కేబినెట్‌లో చర్చించి, అనంతరం శాసనసభలో బిల్లు ప్రవేశపెట్టేలా చర్యలు తీసుకుంటామని మంత్రులు వెల్లడించారు.

## నేను ఏమీ అనలేదు: తాతా మధు

హైదరాబాద్: తెలంగాణ అసెంబ్లీ(Telangana) స్పీకర్ గడ్డం ప్రసాద్(Speaker Gaddam Prasad) ను నేను ఏమీ అనలేదని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధు(MLC Thatha Madhu) పేర్కొన్నారు. స్పీకర్ అంటే నాకు గౌరవం ఉందని, నేను అనని మాటలను నాకు ఆపాదించడం సరికాదన్నారు. నేను స్పీకర్ ను అన్నట్లు భావిస్తే నా మటలు ఉపసంహరించుకుంటున్నానని, నా మాటలపై విచారం వ్యక్తం చేస్తున్నానని తాతా మధు తెలిపారు.




## తెలంగాణకు ఇది ఒక చీకటి రోజు

మొదటి పేజీ తరువాయి

ఆలోచన, వైఖరి అని సీఎం ఆరోపించారు. తెలంగాణ వస్తే దళితుడిని ముఖ్యమంత్రిని చేస్తానని, మూడెకరాల భూమి ఇస్తామని, దళితబంధు అమలు చేస్తామని హామీలు ఇచ్చి వాటిని అమలు చేయలేదని విమర్శించారు. దళిత ఉపముఖ్యమంత్రిని పదవి నుంచి తొలగించారని, నేరెళ్ల ఘటనలో దళితులపై దాడులు జరిగాయని ఆరోపించారు. ప్రభుత్వం సంయమనం పాటిస్తే దానిని చేతకానితనంగా భావిస్తున్నారని, వ్యవస్థలను బెదిరించి లొంగదీసుకోవాలనుకుంటే చూస్తూ ఊరుకోబోమని హెచ్చరించారు. సభా నాయకుడిగా కేసీఆర్ క్షమాపణ చెప్పాలని, అనుచిత వ్యాఖ్యలు చేసిన సభ్యుడితో రాజీనామా చేయించాలని రేవంత్‌రెడ్డి డిమాండ్ చేశారు. సంబంధిత సభ్యుడి సభ్యత్వాన్ని రద్దు చేయాలని కోరారు.

## తెలంగాణ ఓటర్ల జాబితా సవరణకు గడువు పొడిగింపు

మొదటి పేజీ తరువాయి

**దశ, హైదరాబాద్:** తెలంగాణలో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (SIR) ప్రక్రియకు సంబంధించి ఎన్నికల సంఘం కీలక నిర్ణయం తీసుకుంది. క్లెయిమ్స్, అభ్యంతరాల స్వీకరణ గడువును పొడిగించింది. తొలుత సెప్టెంబర్ 16 వరకు ఉన్న గడువును అక్టోబర్ 7 వరకు పొడిగించినట్లు తెలిపింది. క్లెయిమ్స్, అభ్యంతరాల స్వీకరణ అనంతరం వాటిని పరిశీలించి పరిష్కరించే ప్రక్రియ కొనసాగనుంది. ఈ ప్రక్రియను నవంబర్ 5లోగా పూర్తి చేయాలని ఎన్నికల సంఘం నిర్ణయించింది. అనంతరం నవంబర్ 9న తెలంగాణ తుది ఓటర్ల జాబితాను ప్రకటించనున్నారు.

Printed, Published and Owned by B.KALPANA and Printed at Kalpana Publications , Flat No.101,Sri Heights Apartment,Shilpi Colony,Pasumamula Road,Pedda Amberpet,Rangareddy,Telangana-501505, and Published at Flat No.101,Sri Heights Apartment,Shilpi Colony,Pasumamula Road,Pedda Amberpet,Rangareddy,Telangana-501505. Editor: B.KALPANA. PRGI.No.TGTEL/25/A4195. Cell 9848288850, namasteshekar@gmail.com